# సిమెంటు కృష్ణ

నగ్నముని



లోకంలో వయసొచ్చిన అందరాడ పిల్లలకి మల్లేనే ఆ పిల్ల కూడా మొదట్లో మంచు తోనేసిన జలతారు ముసుగు మొహంమీద కి లాక్కుని, రేకువిడదానికన్నా కూడా సిగ్గుపడే మల్లెమొగ్గలా వుండేది. కాళ్ళలో లేళ్ళు గంతులేసేవి. కనురెప్పల్ని కలలు కమ్ము కునేవి కారుమేఘాలు మదపుటేనుగులు గుంపుగా జుట్టులోకి కుమ్ముకొచ్చేవి. చేతులూ, ప్రతి అవయవం యవ్వన పరిమళపు వెలయేళ్ళుగా తుళ్ళిపడేవి పెదవులమీద వెన్నెల ఒలికి, పడుచువరుసని పలకరించి, ఒంటిలో యింకిపోయేది.

నడిస్తే నడుస్తున్న హారతిలా వుండేది.

ఆ పిల్ల తండ్రి కాళ్ళూ, చేతులూ మెదడూ ఎప్పుడూ ఎక్కడో వన్నేస్తుండేవి. అర్ధ రాత్రుళ్ళు భగ్గుమని చివరిమంటమండే లాంతర్లాంటి కళ్ళతో యింటికి చేరేవాడు. కుష్ఠు వ్యాధి వ్యాపించినవాడిలాగా దరిద్రంతో తీసుకుంటుండేవాడు. దరిద్రం క్రమంగా అతని అన్ని అవయవాల్ని తినేస్తోంది. నెమ్మదిగా యింటిగోడలకి, యింట్లోని యితర వస్తువులకి, మనుషులకి వ్యాపిస్తోంది.

తల్లి వంటింటి అలుగ్గుడ్డ. ఎడతెరిపిలేని దగ్గుగా మారి చింకిచాపమీద ముణగదీసుకుండేది. అర్ధరాత్రి మసిబారిన లాంతరు కళ్ళతో, సగంసగం అవయవాల్తో యింటికొచ్చే కట్టెతో కాపరంజేసేది.

వీధిలోని పెంటకుప్పకీ, యింటికీ పెద్ద తేడాలేదు. పెంటకుప్పమీద గులాబీ మొక్కలాగా ఆ పిల్ల తనని తాను చూసుకునే లోపలే ఎడిగిపోయింది.

అవయవాలన్నీ అందమైన పువ్వుల్లోకి మారిపోయినై. కుండీలో పెడతాననీ, మేకలు తినెయ్యకుండా కాపలాకాస్తాననీ,

ఇంటుకట్టి మరిన్ని అందమైన రంగురంగుల పూలు పూయిస్తాననీ పుస్తకాల్లోంచి. పక్క వీధిలోంచి ఎగిరొచ్చాడో కుర్రావాడు. వాడి మాటల్లో మత్తుపానీయాలున్నాయ్. వాడి కళ్ళలో గురితప్పని పూలబాణాలున్నాయ్. వాడి నిట్టూర్పుల్లో మధురంగా బంధించే లతలున్నాయ్. వాడి చొక్కాకి గలగలలాడే జేబుంది. వాడి వొంట్లో సలసలకాగే రక్తసరసుంది. వాడి చేతిలో గుండెల్ని సుతిమెత్తగా తెరిచే రహస్య తాళంచెవివుంది.

అనుమతివ్వాలో లేదో తేల్చుకోకముందే ఆమె గుండెని తెరిచి దేహమంతా ఆక్రమించుకున్నాడువాడు. రోజులు అగరొత్తులుగా వెలిగినయ్. వాగ్దానాల పూసలు దవనపువాసనలైనై. సెలవులయి పోయినయ్. వొచ్చినంత వేగంతో తిరిగి దూరపు కాలేజీ పుస్తకాల్లోకి పారిపోయాడు వాడు. వెళిపోయేప్పుడు కిటికీలు మయ్యలేదు. తలుపుదగ్గరికయినా వెయ్యలేదు కలలు కళ్ళనికమ్మేస్తే గుండెని బార్లాతెరిచి, గాయంచేసి వెళిపోయాడు.

గుమ్మందగ్గరే మొక్కగా వుండగానే మానైపోయి వాడికోసం రెప్పలుపీకేసిన కళ్ళతో వెతికింది. ఆ తర్వాత ఆ గుమ్మం దగ్గరికి రకరకాల తాళాల వ్యాపారులొచ్చారు. వాళ్లంతా తాళాల దొంగలేతప్ప గుండె చప్పుడు వినగల్గిన వాళ్ళుకాదు. కొందరు పాత తాళాలకి కొత్త తాళాలు అమ్మే వాళ్ళయితే మరికొందరు కొత్త తాళాల్ని త్వరితంగా తుప్పుతాళాలుగా మార్చేసే వాళ్లే. ఆ యినప వ్యాపారులందరికీ యినప బీరువాలు తెరవగలిగిన తాళాలు కావాలి. అంతే.

వాళ్లంతా అనేకమంది జంతువుల్ని వెంట తీసుకొచ్చేవారు. అవి మానవ భాషలో తెగ అరిచేవీ కరిచేవీ. తండ్రీ కొడుకులూ, అన్నదమ్ములూ, మామా అల్లుళ్లు, బావ, బావమరుదులు రకరకాలైన జంతువులొచ్చేవి. ఒకడు బొజ్జతో ఖద్దరువాసనకొడతాడు. మరొకడు కాంట్రాక్టుల వాసనవేస్తాడు. ఒకడు కాసేపు దేహంలోకి వుమ్మేసి బస్సెక్కో, రిక్షాఎక్కో పాపంచేసినవాళ్లా పారిపోతాడు. మరొకడు రాత్రంతా కాండ్రించి వూసి తెలతెలవారుతుండగా మళ్ళీ మామూలు ముఖం తగిలించుకుని జారుకుంటాడు అందరిచర్మపు భాషా ఒకటే. ఒక్కడూ గుండె చప్పుడు వినడు

ఉమ్ముల దారిలో చర్మం బీటలువారుతోంది. శరీరవృక్షం బెరడు పెళ్లలుగా రాలుతోంది అయినా ఆశచావదు వాడెప్పుడో యీ దారంట వస్తాడు పశ్చాత్తాపపడతాడు. మనసులో తిరిగి మరులు పూయిస్తాడు. ఇల్లూ, పిల్లలూ చల్లని సంసారంతో సన్నజాజి పందిరివేస్తాడు వాడికోసం రోడ్డుమీద మొహాలు చూడ్డం, వీలువున్నప్పుడల్లా వీధులంట తిరగడం, పార్కులో మూలకూచుని రావడం మానలేదు

ఒకరోజున పార్కులోనే జాలా రాత్రయిపోయింది రెండ్రోజుల్నుంచీ తిండిలేదు. నీర్సంగావుంది ఇంటికిపోదామని లేచేసరికి వర్షం మొదలయింది. పరిగెత్తుకెళ్ళి పార్కులోనే మూలషెడ్డులాంటిదుంటే అందులో

జేరింది. అప్పటికే బట్ట తడిసింది. మెరుపుల్తో వాన పెరుగుతోంది. కింద నాపరాయి, పైన రేకులు, జల్లుకూడా మీదకిచిందటంలేదు. కాస్తపర్వాలేదని ముణగదీసుకుని మూలకి జేరబడింది. ఎవరూ దరిదాపుల్లో లేరు. దూరపు గుడ్డిలైటు వెల్తురు. వర్షం తన పక్కనే మెరుపుల్లో చూస్తే ఎవరో ఒకడు పడుకున్నట్లు కనబడింది. గతుక్కుమని లేచి పరకాయించి చూసింది. మళ్లీ మెరుపులో చూసినప్పుడు అంతవిషాదంలోనూ నవ్వొచ్చింది.

అది ఆవూరుని ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన ఒక గొప్ప రాజకీయ నాయకుడి విగ్రహం. జతికుంతగా ఆయన అనేక పదవులు అలంకరించాడు. చేతికి ఎముకల్లేవన్నారు. శ్రీమహావిష్ణువే సాక్షాత్తూ యీయన రూపంలో ప్రజాసేవ నిమిత్తం అవతరించాడన్నారు. పేదలపాలిట పెన్నిధి అన్నారు. సంస్కర్త అన్నారు. ఒకప్పుడు పార్కు మధ్యన తిన్నెమీద రాజసంగానుంచుని నీరాజనలందుకున్నదా విగ్రహం. ఇప్పుడు ప్రత్యర్థులు పదవిలోకొచ్చాక షెడ్డులో పడుంది. ఆ సిమెంటు విగ్రహాన్నానుకున్న గోడకి జేరగిలబడిందామె. ఎప్పుడు పట్టిందో నిద్ర వర్షంపడుతూనే వుంది. శరీరం నేలమీద మూలకి ముణగదీసుకుని తుఫానుతో చెట్టులాగా వాలిపోయేవుంది. కమ్మటి నిద్ర పట్టేసింది. పాతకల. నిద్రలోనే వాడితో గడిపినరాత్రి కల దుప్పటిగా కప్పుకుంది. అమాయకపు జంతుమోహంతో వాడొచ్చాడు తలుపు తట్టాడు. పశ్చాత్తాపడ్డాడు, క్షమించమన్నాడు. తిరిగి గుండెతాళం తెరిచాడు. బలంగా, బరువుగా మాటల మత్తువాసనల్తో యింటినిండా వసంతం నింపాడు. వాడి కౌగిట్లో కళ్ళుమూసింది. ఆవేశంలో కొట్టుకుపోయింది. అలిసిపోయి ఒడ్డుకుజేరిపడిపోయింది.

వర్షం పెద్దదయిపోయింది. ఎక్కడో పిడుగుపడింది. చప్పున ఆమెకి మెలకువొచ్చింది. లేవాలని ప్రయత్నించింది. లేవలేకపోయింది. తనమీద ఏదో బరువుగా పడుకునుంది. బలంగా పక్కకి తోసేసి నుంచుంది. విగ్రహం తనవంకే నవ్వుతూ చూస్తోంది. తిరిగి సిమెంటు చేతుల్తో దగ్గరికి లాక్కోడానికి ప్రయత్నిస్తోంది. చీరసరిజేసుకుంది. తన కలలో జేరింది ఆ విగ్రహం కౌగిట్లోకా? మతిబోయి, పరిగెత్తుకుంటూ వర్షంలోనే బయటకొచ్చిపడింది. కంగారులో దారి తప్పింది. ఎప్పటికో యింటికి జేరింది నెల తప్పింది. కడుపులో సిమెంటు బలంతో మరో మొక్క దేహపు రాళ్లమధ్య వేళ్ళూనింది- మొక్కని పీకెయ్యలేకపోయింది. ఆకాశంలో మెరుపులు. దేహంపై నిరంతరం కురిసే మురికివాన లోకంనిండా స్మశానంలో కంకాళాల్లా పెరిగిపోతున్న కుప్ప తాళపుచెవులు. ముఖాల్లో అడివి జంతువుల హాహాకారాలు. అయినా ఆమెలో ఆశ చావలేదు. వాడెప్పుడో వస్తాడు. గాయాలుకడుగుతాడు. మరో గులాబీ మొక్క పెంటపోగులో ఎదుగుతోంది. వెయ్యి రేకల్తో పుష్పించబోతోంది. సృష్టికి సిగ్గులేదు.